# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు — తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954



Cerculated by Hyderbad, Nalgonda, Nizambad, Warngall, Khammam, Rangareddy, Kamareddy, Medak, Adilabad,Manchiryal, KarimNagar

పబ్లిషర్: హైదరాబాద్ సంపుటి : 1 సంచిక : 17 మంగళవారం 27- 8-2024 పేజీలు : 4 వెల రూ.- 3





### కవిత బెయిల్ పిటిషన్‌పై

# సర్వత్రా ఉత్కంఠ..



హైదరాబాద్:**మనవెలుగు** ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై సర్వత్రా ఉత్కంఠ నడుస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి.. తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై మంగళవారం సర్వోన్నత న్యాయ స్థానంలో విచారణ జరగనుంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ వేశారు. ట్రయల్ కోర్టు, హైకో ర్టులు తన బెయిల్ పిటిషన్లను తిరస్కరిం చడంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. గత విచారణలో ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

22వ తేదీకల్లా కౌంటర్ దాఖలు చేయా లని ఈడీని సుప్రీంకోర్టు ఆదేశిం చింది. హైకోర్టులో కేసు డైరీ ఉండగా కౌంటర్ దాఖలు చేసేందుకు ఎందుకు ఆలస్యం అయిందని ప్రశ్నిం చింది.మహిళగా కవిత బెయిల్‌కి అర్హురాలు అంటూ కవిత తరపు న్యాయవాది ముఖుల్ రోహత్గి వాదించారు. ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకి బెయిల్ మంజూరు చేశారని, కవితకు బెయిల్ ఇవ్వాలంటూ ఆమె తరపు న్యాయవాది వాదించారు. కేసు విచారణ పూర్తి చేసి, ఛార్జ్ షీట్ కూడా ఫైల్ చేశారని కోర్టుకు కవిత తరపు న్యాయవాది తెలిపారు. రేపు ఇరుపక్షాల వాదనలను సుప్రీంకోర్టు విననుంది.

జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనా న్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. కవిత ఇప్పటి వరకూ ఎన్ని సార్లు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసినా వరుసగా నిరాశే ఎదుర వుతోంది. కవిత తొలుత
తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని రౌస్ అవెన్యూ కోర్టును కోరగా.. న్యాయమూర్తి నిరాకరిం చిన విషయం తెలిసిందే.

# ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి

## – రైతులు..వర్సిటీలు.. ఉద్యోగాలు
## –మా ప్రభుత్వ ప్రాథమ్యాలు ఇవే: సీఎం రేవంత్

హైదరాబాద్: **మనవెలుగు** ఉద్యోగ కల్పన, మెరుగైన విద్య కోసం విశ్వవిద్యాలయాల అభివృద్ధి, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.గత ప్రభు త్వం కేవలం పదవులు, ఫామ్‌హౌస్‌లు, బంగళాలు, ఆస్తుల జమ లాంటి ప్రాధాన్యతలతో పదేళ్లు అధికారం చలాయించిందని ఆయన ఆరోపించారు.తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటోందని.. తనతోపాటు మంత్రులు, అధికారులను ఎవరైనా కలిసి ప్రశ్నించే వెసులుబాటు ఉందన్నారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం కార్యక్రమంలో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు సింగరేణి కాలరీస్ లిమిటెడ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు.

**స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీలతో..**

'గత ప్రభుత్వం పదేళ్లలో పరీక్షలు నిర్వహించకుండా తీవ్ర జాప్యం చేస్తే మేం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 35 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు వేగవంతం చేశాం. రాష్ట్రంలో సర్టిఫికెట్ కోర్సులకే విద్య పరిమితమైంది. చదువుకు తగిన శిక్షణ లేకపోవడంతో యువత ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూని



వర్సిటీని ప్రారంభించాం. ప్రఖ్యాత పారిశ్రామి కవేత్తలతో వర్సిటీ పాలకమండలిని ఏర్పాటు చేశాం.వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను ఎంపిక చేశాం. ఈ ఏడాది 2 వేల మందికి, వచ్చే ఏడాది 20 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నాం.
ఇటీవల ఒలింపిక్స్‌లో భారత్‌కు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని నిర్ణయించాం. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్‌కు పెద్ద సంఖ్యలో పథకాలు వచ్చేలా క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం'అని రేవంత్ వివరించారు.

**100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు**

రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు రానున్న పది రోజుల్లో వైస్ చాన్స్‌లర్లను నియమించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 'వీసీల నియామకం పూర్తి కాగానే ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను కూడా భర్తీ చేస్తాం. గత ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంది.
కానీ కనీస వసతుల్లేక పౌల్ట్రీ షెడ్‌లో కోళ్ల మాదిరిగా వాటిని తయారు చేసింది. కానీ మేము మెరుగైన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నాం. ఒక్కో క్యాంపస్‌ను 20 నుంచి 25 ఎకరాలతో ఏర్పాటు చేస్తాం'అని రేవంత్ తెలిపారు.

## ఢిల్లీ నుంచి పాలించాలనుకోవడం అవివేకం

**జమ్మూకశ్మీర్ రాష్ట్ర హెూదా డిమాండ్‌ను పునరుద్ఘాటించిన రాహుల్‌గాంధీ**
**ఇటీవలి కశ్మీర్ పర్యటనలో విద్యార్థినులతో రాహుల్ ముఖాముఖి**

న్యూఢిల్లీ: మనవెలుగు జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలనే డిమాండ్‌ను రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఢిల్లీ నుంచి జమ్మూకశ్మీర్‌ను పాలించాలనుకోవడం అవివేకమన్నారు. గత వారం ఆ రాష్ట్ర పర్యటన సందర్భంగా విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముఖాముఖి మాట్లాడారు. ఆ వీడియోను కాంగ్రెస్ పార్టీ సోమవారం విడుదల చేసింది. ఈ వీడియోలో రాహుల్ గాంధీ జమ్మూకశ్మీర్‌లో జరగబోయే ఎన్నికల గురించి మాట్లాడుతూ, ఒక రాష్ట్రం నుంచి రాష్ట్ర హెూదాను తొలగించడం భారత చరిత్రలో ఇదే మొదటిసారన్నారు.



# ఎపిలో మంకీపాక్స్ కలకలం

## దుబాయ్‌నుంచి వచ్చిన చిన్నారికి లక్షణాలు

విజయవాడ,ఆగస్ట్26**మనవెలుగు**
ప్రపంచవాప్తంగా హడలెత్తిస్తున్న మంకీపాక్స్ ఏపీలోనూ కలకలం రేపింది. దుబాయ్ నుంచి విజయవాడకు వచ్చిన ఓ చిన్నారికి మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లు వార్తలు రావడంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందుకోసం విజయ వాడ కొత్త ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరు పడకలతో ఓ వార్డును సిద్ధం చేసింది. అందులో అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచింది.
సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ఈ ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. అన్ని రకాల ఇంజక్షన్లను అందు బాటులో ఉంచామని ఆయన చెప్పారు. ఇప్పటికే భారత ప్రభుత్వం దీనిపై అప్రమత్తమైంది. ఇదిలావుంటే డబ్ల్యూహెచ్‌వో? హెచ్చరికల నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. అన్ని రాష్ట్రాల్లోనూ టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని



కేంద్రం సూచించింది. అన్ని విమానాశ్ర యాలను అప్రమత్తం చేసి విదేశాల నుంచి వచ్చేవారికి వైద్య పరీక్షలు చేయాలని తెలిపింది. ఇటు తెలంగాణ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. హైదరాబాద్‌లోని గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. గాంధీ ఆస్పత్రిలో ఇందుకోసం ప్రస్తుతం 20 పడకలు కేటాయించారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంతవరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని అధికారులు చెబుతు న్నారు. తాము పూర్తి స్థాయి అప్రమత్తంగా ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు.

# బ్యాంకు ఉద్యోగికి అనుకూలంగా హైకోర్టు తీర్పు

- కొట్టేసిన బంగారం విలువ మినహా మిగతా డబ్బు ఇచ్చేయండి!
- యూనియన్ బ్యాంకు నర్సరావుపేట బ్రాంచిలో లాకర్‌లోని బంగారం మాయం
- బ్యాంకు ఉద్యోగి బీఎం నాయక్‌పై అధికారుల ఫిర్యాదు
- అదే నెల చివర్లో నాయక్ పదవీ విరమణ
- ఆయన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఖాతాలు జప్తు చేసిన అధికారులు
- బ్యాంకు తీరును తప్పుపట్టిన హైకోర్టు
- ఆలోగా ముగించకపోతే నిలిపివేసిన సొమ్మూ ఇచ్చేయాలని ఆదేశాలు



అమరావతి**మనవెలుగు**
పదవీ విరమణకు ముందు ఖాతాదారుని లాకరు నుంచి బంగారం చోరీ చేసినట్లు ఆరోపణలు ఉన్న యూనియన్ బ్యాంకు ఉద్యోగికి చోరీకి గురైన బంగారం విలువ మినహా మిగతా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఆయనపై శాఖాపరమైన విచారణ మూడు నెలల్లో ముగించాలని, ఆలోగా ముగియకపోతే నిలిపివేసిన సొమ్మునూ ఇచ్చేయాలని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది.పల్నాడు జిల్లా నర్సరావుపేట యూనియన్ బ్యాంకులో 2019 మార్చి 5న ఓ ఖాతాదారుడి లాకర్ నుంచి బంగారం సంచి మాయమైంది. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించిన బ్యాంకు అధికారులు ఆ బంగారాన్ని ఆ శాఖ ఉద్యోగి నాయక్ చోరీ చేశారని నర్సరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నాయక్‌పై కేసు నమోదు చేశారు

అదే నెల 31న నాయక్ పదవీ విరమణ చేశారు. ఆ ఏడాది డిసెంబరు 3న బ్యాంకు అధికారులు నాయక్‌పై శాఖాపరమైన విచారణ ప్రారంభించారు.పదవీ విరమణ అనంతరం నాయక్‌కు రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాల డబ్బు ఆయన ఖాతాలో జమ చేసినప్పటికీ, క్రిమినల్ కేసు, శాఖాపరమైన విచారణ పెండింగ్‌లో ఉండటంతో వాటిని బ్యాంకు అధికారులు జప్తు చేశారు. ప్రొవిజినల్ పెన్షన్ మినహా మిగిలిన ప్రయోజనాలన్నింటినీ నిలిపేశారు. ఖాతాల జప్తుపై నాయక్ 2022లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
మంగళవారం 27 ఆగష్టు 2024

# హైదరాబాద్ లో రోడ్డు ప్రమాదం.. యువతి మృతి



హైదరాబాద్ లో ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగం పేట లో విషాదం చోటు చేసుకుంది.గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొనతల రమేష్ ప్రమీల కూతురు రమ్య (22) హైదరాబాద్ లో ప్రయివేటు ఉద్యోగం చేస్తుంది.ఈ క్రమంలో సోమవారం మద్యాహ్నం కార్యాలయం నుండి తన ద్వి చక్ర వాహనం పై రూం కు వస్తుండగా వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో రమ్య అక్కడికక్కడే మృతి చెందినట్లుగా తెలిపారు. దీంతో లింగం పేటలో విషాదం చోటుచేసుకుంది.

# హైడ్రా కూల్చివేతలు సమర్ధనీయమే

**పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి**

**మీడియాతో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

హైదరాబాద్,ఆగస్ట్26(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాను స్వాగతిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో నారాయణ మాట్లాడారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు కబ్జా చేయడం వల్ల వర్షపు నీరు ఎటు వెళ్లాలో అర్థం కావడం లేదు. అందుకే అరగంటపాటు వర్షం కురిస్తే నగరం ముంపునకు గురయ్యే పరిస్థితి వస్తోంది. హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చుతున్నారు. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పులిమీద స్వారీ చేస్తున్నారు. ఆయన పులి మీద నుంచి దిగొద్దు.. దిగితే మింగేసే ప్రమాదం ఉంది. చెరువుల్లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేస్తున్నాయి. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులు కబ్జా చేసి కార్యాలయాలు నడుపుతున్నాయి. ఈ అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నారాయణ డిమాండ్ చేశారు.భాజపాయేతర రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందనినారాయణ అన్నారు. దేశంలో ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. అదానీకి సెబీ దాసోహమైందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు.

# పోలీసుల అదుపులో వైకాపా నేత కొల్లం గంగిరెడ్డి



రైల్వేకోడూరు: వైకాపా నేత, అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వేకోడూరులోని లక్ష్మీ థియేటర్‌కు సంబంధించిన స్థల వివాదం కేసులో అతడిని ప్రశ్నించారు.

ఆదివారం సాయంత్రం థియేటర్ వద్ద గొడవ జరిగింది. ఈ విషయంలో థియేటర్ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, విచారణలో భాగంగా కొల్లం గంగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో సోమవారం గంగిరెడ్డి అనుచరులు థియేటర్ వద్ద గొడవకు దిగారు.

సోమవారం సాయంత్రం దాదాపు గంట పాటు రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో గంగిరెడ్డిని విచారించిన పోలీసులు ఆ తర్వాత విడిచిపెట్టారు. కానీ, ఎస్పీ విద్యాసాగర్‌కి సమాచారం ఇవ్వడంతో వెంటనే అతడిని తన వద్దకు తీసుకురావాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో మళ్లీ అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ప్రస్తుతం మదనపల్లెలోనే ఉండటంతో అక్కడికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పుల్లంపేట మండలానికి చెందిన గంగిరెడ్డి అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్‌గా పేరొందారు. పలు ఎర్రచందనం కేసుల్లో గతంలో తెదేపా ప్రభుత్వం గంగిరెడ్డిని అరెస్టు చేసింది. అయితే, వైకాపా హయాంలో అతడిని విడుదల చేశారు. ఆ తర్వాత ఆ పార్టీలో చేరిన గంగిరెడ్డి..అనేక సెటిల్ మెంట్లు, భూదందాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

**బిఆర్ఎస్ విమర్శలపై మండిపడ్డ కోదండరెడ్డి**

**రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలు కూల్చేయాలన్న నేతలు**

హైదరాబాద్,ఆగస్ట్26 హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది. అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు. కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతు న్నారు. తెలంగాణ సర్కార్ హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, నాలాలు రక్షిస్తోందని కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. సోమవా రం మీడియాతో మాట్లాడుతూ... దూరదృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ప్రొటెక్షన్ ఆఫ్ లేక్స్ కమిటీ కూడా గతంలో వేసిందే అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర విభజన కాకముందే కాంగ్రెస్ సర్కార్ 2030 వరకు హెచ్ఎమ్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఒదన్నారు.తాగునీటి అవసరాల కోసం కూడా మాస్టర్ ప్లాన్‌లో లేక్స్ ప్రొటెక్షన్ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. 2014 నుంచి అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అక్రమ నిర్మాణాలకుమద్దతు చేసిందని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌పై ఎంఐఎం, బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని మండిప డ్డారు. సామాన్య ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నార న్నారు. ప్రజలు కూడా ర్యాలీ చేస్తున్నారన్నారు. హుస్సేన్ సాగర్ కాపాడుకోవాలని విజయభాస్కర్ రెడ్డి కాలంలో బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు, నెక్లస్ రోడ్ ఏర్పాటైందన్నారు. తొమ్మిదన్నరేళ్ల కాలంలో చెరువులను ఎందుకు కాపాడలేదని హరీష్ రావును కోందండరెడ్డి ప్రశ్నించా రు. కేవలం ప్రబుత్వంపై విమర్శలు చేయడమే బిఆర్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతిని కాపాడడానికి చెరు వులు కాపాడాలన్నారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి నీటిని తీసు కొచ్చింద న్నారు. కాంగ్రెస్ సర్కారే రానున్న 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిపారు. ధర్మం కోసం భగవత్ గీతను కూడా స్ఫూర్తిగా తీసుకున్నా అని సీఎం రేవంత్ నిన్న చెప్పారన్నారు. హెచ్ఎండీలో అధికారు లు అవినీతికి పాల్పడుతున్నారని కోదండరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వం పల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్పు, పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు. హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని.. అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివే తలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయ దుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మా ణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# తెలంగాణలో ఆరు రోజుల పాటు భారీ వర్షాలు



హైదరాబాద్ : తెలంగాణలో రానున్న ఆరు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 29 నాటికి తూర్పు మధ్య, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది.

ఆగస్టు 26, 27 తేదీల్లో ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది తెలిపింది.

27వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. మగంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

28వ తేదీ నుంచి 29వ తేదీ మధ్య ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబా బాద్, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

29 నుంచి 30వ తేదీ మధ్య ఆదిలాబాద్ కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

30 నుంచి 31వ తేదీ మధ్య ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశముందని తెలిపింది.

ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

31వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ మధ్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది.

# కొత్త పార్టీ పెట్టే యోచనలో యశ్వంత్ సిన్హా.. పేరు ఇదేనా?

హజారీబాగ్: కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కొత్త రాజకీయ పార్టీ స్థాపించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది చివర్లో ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ ప్రచారం జోరందుకొంది.ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఝార?ండ్‌లోని అటల్ సేవా కేంద్రంలో తన మద్దతుదా రులతో సమావేశమై.. కొత్త పార్టీ ఏర్పాటు ప్రతిపాదనపై చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం దిల్లీకి బయల్దేరిన సందర్భంగా ఆయన మీడియాతో మాటా ్లడారు. సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదిం చిన అనంతరం అటల్ విచార్ మంచ్ (%ూఎవీ%) ఏర్పాటుపై త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడిం చారు. ఆదివారం జరిగిన ఈ సమావేశానికి భాజపా మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సురేంద్ర కుమార్ సిన్హా అధ్యక్షత వహించగా.. మాజీ ఎంపీ జయంత్ సిన్హా, పలువురు మద్దతుదారులు హాజరయ్యారు. మరోవైపు, రాష్ట్రంలో కొత్త పార్టీ పట్ల ఆయన మద్దతుదారులు ఉత్సాహంతో ఉన్నారు. ఇది ఝార?ండ్ ఓటర్లకు ప్రత్యామ్నాయం కానుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**సీఎం రేవంత్ పులి మీద స్వారీ చేస్తున్నారు: సీపీఐ నేత నారాయణ**

దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేలా పార్టీ పేరును అటల్ విచార్ మంచ్‌గా సిన్హా ప్రతిపాదించినట్లు ఈ సమావేశానికి హాజరైన ఒకరు తెలిపారు. యశ్వంత్ సిన్హా వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా సేవలందించారు. హజారీబాగ్ లోక్‌సభ సీటు నుంచి 1998, 1999, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు.

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం జయంత్ సిన్హాకు బదులుగా మనీశ్ జైశ్వాల్‌ను భాజపా పోటీలో ఉంచగా.. ఆయన భారీ మెజార్టీతో గెలుపొందారు.

# ప్రముఖుల కృష్ణాష్టమి శుభకాంక్షలు

**గవర్నర్, సిఎం, విపక్ష నేతల అభినందనలు**

హైదరాబాద్,ఆగస్ట్26
గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని వారు ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు. మానవ జీవితంలో 'గీత' బోధనలు ప్రభావశీలమైనవి. మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటాడు. ఆ శ్రీకృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరికీ అందాలని ప్రార్థిస్తున్నా' అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు!' అని కేసీఆర్ పోస్ట్ చేశారు.

' వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్. దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్. సమస్త లోక రక్షకుడు యశోదానందనుడు, ధర్మాన్ని స్థాపించి, అధర్మాన్ని, అన్యాయాన్ని అంతం చేసిన పవిత్ర జగద్గురువు అవతార మూర్తి జన్మాష్టమి పర్వదినం. శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ పేర్కొన్నారు. వీరితోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ప్రముఖులంతా సోషల్ మీడియా వేదికగా కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు
తెలుగు దినపత్రిక
మంగళవారం 27 ఆగస్టు 2024

# రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

## మరో ఐదు రోజులు భారీ వర్షాలు



హైదరాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
అల్పపీడనం ప్రభావంతో రానున్న ఐదురోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో అకడకడ వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అకడకడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 7.2సెం.మీ వర్షపాతం నమోదైంది.

# హాస్టల్ విద్యార్థుల కొరకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు

## – జిల్లా కలెక్టర్ సత్య శారద



వరంగల్, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి సోమవారం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. సంక్షేమ హాస్టళ్లలో నివసించే విద్యార్థుల సమస్యలను తెలుసుకోవ డానికి వరంగల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా విద్యాలయాల్లో జిల్లా కలెక్టర్ సత్యశారద ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేశారు. ఇకపై విద్యార్థులకు ఏటువంటి సమస్య వచ్చిన తమ సమస్యలను చీటీపై రాసి పెట్టెల్లో వేస్తే, తనిఖీల వేళ కలెక్టర్ స్వయంగా ఫిర్యాదు పెట్టెలను తెరిచి చీటీలను చూస్తారని,పెట్టెలకు సంబంధించిన వాటి తాళాలు కూడా కలెక్టర్ వద్దే ఉంటాయని తెలుస్తుంది.

# 16ఏండ్ల నుండి 34 సార్లు రక్తదానం చేసిన హెడ్ కానిస్టేబుల



సూర్యాపేట, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
16ఏండ్ల కాలంలో 34సార్లు అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఎందరో ప్రాణాలను నిలిపి ఎంతో మంది ఆదర్శంగా నిలుస్తున్నారు సూర్యాపేటకు చెందిన హెడ్ కానిస్టేబుల్ పాలెల్లి రమేష్ ఏ పాజిటివ్ రక్తం కావాల్సిన వారికి అందుబాటులో ఉంటూ అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తూ తన వంతు సమాజ చేస్తున్నారు రమేష్. కరోన సమయంలో ఒకే ఏడాదిలో నాలుగు సార్లు రక్తదానం చేయగా రక్త కొరత లేకుండా సోషల్ మీడియాలో అన్ని రకాల గ్రూప్ లకు చెందిన వివిధ వర్గాలకు చెందిన వారితో గ్రూప్ ఏర్పటూ చేసి రక్తదానం చేసేందుకు నిత్యం అందుబాటులో ఉండే విదంగా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.. అదే విదంగా ప్రతి సంవత్సరం అనాథ పిల్లలకు ఉచిత నోట్ బుక్స్ అందిస్తూన్నారు. అంతేకాకుండా ఇంటింటికి తిరిగి పాత బట్టలను సేకరించి అనాథ ఆశ్రమంలో ఉన్న వారికి అందించి తన దౌతృత్వాన్ని చాటుకుంటున్నడు. ఖాళీ సమయాల్లో వంట చేస్తూ వచ్చిన ఆదాయంతో చదువుకోలేని పేద పిల్లలను చదివిస్తూ సేవ గుణాన్ని చాటుకుంటున్నారు.
అవయవ దానంపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ అవయ వాలు దానం చేసేందుకు ముందుకు వచ్చేలా తన వంతు కృషి చేస్తున్నారు..హైదరాబాద్ కు చెందిన జీవన్ ధర్ సంస్థకు తన మరణాంతరం అవయవాలను దోనెట్ చేసేందుకు అగ్రిమెంట్ సైతం అందించారు రమేష్.

# అరచేతిలో నేస్తం.. మితిమీరితే అనర్థం

**- సెల్ అతిగా వాడడంతో శారీరక, మానసిక సమస్యలు**

**- సామాజిక మాధ్యమాల వలలో విలవిల**



హైదరాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
సగటున ప్రతిఒక్కరు రోజుకు 70 సార్లు ఫోన్ చూస్తున్నారు. అతిగా ఫోన్ చూడడం వల్ల 20శాతం మంది కెరీర్‌లో వెనకబ డుతున్నారని ఒక సర్వేలో వెల్లడైంది. ఈతరం ఆధునిక సాంకేతికతకు కేరాఫ్ చిరునామా స్మార్ట్‌ఫోన్. ఆన్‌లైన్ తరగతులతో ఒక్కో కుటుంబంలో సెల్‌ఫోన్ల వినియోగం పెరిగింది. సరైన మార్గంలో వాడిన వారికి ఆసరా అవుతుంది. అతిగా వినియోగిస్తే వ్యక్తిగతంగా, వృత్తిగతంగా అసమ ర్థులుగా చేస్తోందని మనస్తత్వ నిపుణులు హెచ్చరిస్తున్నారు. శారీరక, మానసిక సమస్యలతో వచ్చిన వారిని ప్రశ్నించి నపుడు ఏదోరూపంలో మొబైల్ వినియోగంతో సంబంధం ఉన్నట్టు వైద్యపరీక్షల్లో గుర్తిస్తున్నారు. అకస్మాత్తుగా ప్రవర్తన లో లోపం గుర్తిస్తే తప్పకుండా ఫోన్‌లో మునిగినట్లేనని వైద్యులు చెబుతున్నారు.

**శారీరక ఇబ్బందులు....**
**స్క్రీన్ సమయం పెరగడంతో శారీరక శ్రమ తగ్గి అధికబరువు**
ఊబకాయంతో జీవనశైలి వ్యాధులు రాత్రిళ్లు ఎక్కువ సమయం మేల్కొనడంతో నిద్రలేమి వినికిడి సమస్యలు కళ్లు పొడిబారటం, తలనొప్పి, పార్శ్వపునొప్పి, దృష్టిలోపం రోజూ 6గంటలకు పైగా వాడితే చిటికెన వేలు నొప్పి (స్మార్ట్‌ఫోన్ పింక్), బైక్ నడుపుతూ మెడ ఒక వైపు వంచి ఫోన్ మాట్లా డటంతో మెడనొప్పి, ఎక్కువసేపు మాట్లాడేందుకు ఒకే చేతిని ఉపయోగించటంతో మోచేతినొప్పి (సెల్‌ఫోన్ ఎల్బో)
రోజూ రెండు గంటలు స్క్రీన్ బ్రేక్ ఇచ్చేద్దాం

**డాక్టర్ గీత చల్లా, మనస్తత్వ విశ్లేషకులు....**

రోజులో కొంత సమయం స్క్రీన్‌కు బ్రేక్ ఇచ్చేద్దాం. రోజూ 2 గంటలు ఫోన్ ముట్టకుండా విరామం ఇవ్వండి. పిల్లలకు మెదడుకు పదనుపెట్టేలా ఆటలు, పజిల్స్ ఇవ్వొచ్చు. సామాజిక మాధ్యమాలు, ఇతర అంశాలు చూసేందుకు నిర్దేశిత సమయాన్ని కేటాయించుకోవాలి.

**కంటిపై ఒత్తిడి తగ్గించండి...డాక్టర్ దివ్యనటరాజన్, ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి.....**
విద్యార్థులు స్క్రీన్ ఉపయోగించేటపుడు పెద్దవాటిని ఎంపిక చేసుకోవాలి. మెడ, వెన్నుపై ఒత్తిడి పడకుండా సరైన భంగిమలో కూర్చొని చదవాలి. స్క్రీన్ ప్రొటెక్టర్లు ఉపయోగించాలి. కళ్లు పొడిబారకుండా ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని చూస్తూ కంటి కండరాలను కదపాలి.

# పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలి

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు పై నిఘా ఉంచాలి
- గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి




జగిత్యాల ప్రతినిధి, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
జగిత్యాల జిల్లా మెట్ పల్లి డీఎస్పీ కార్యాలయంలో కోరుట్ల, మెట్ పల్లి సర్కిల్ పోలీస్ అధికారులతో సోమవారం నిర్వ హించిన నెల వారి క్రైమ్ మీటింగ్ సమావేశంలో గత నెలలో జరిగిన నేరాలపై చర్చించి పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దీర్ఘకాలంగా పెండిం గులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించి వాటి సంఖ్యను తగించేలా కృషి చేయాలని అన్నారు .ఇందుకోసం కోర్టులలో న్యాయమూర్తులతో చర్చించి కేసుల పురోగతి, విచారణ విషయాలలో అధికారులంతా చురుకుగా పని చేయాలని సూచించారు. ఇదే సమయంలో కోర్టు కేసులలో శిక్షల శాతం మరింత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేర నియంత్రణలో బాగంగా సొసైటీ పర్ పబ్లిక్ సేఫ్టీ లో బాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో,గ్రామాలలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేల ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణ కొరకు రోడ్డు భద్రతపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని అన్నారు. దొంగ తనాలు జరగకుండా రాత్రి పూట గస్తి బీట్‌లు, పెట్రోలింగ్ నిర్వహించాలని 100 కాల్ కి వెంటనే స్పందించి ఆపదలో ఉన్న వారికి తక్షణ సహాయం అందజేయలాని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు పై నిఘా ఉంచాలి...జిల్లాలా, రాష్ట్ర సరిహద్దుల నుండి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణా పకడ్బందీగా నియంత్రించాల న్నారు. అక్రమ కార్యకలాపాలు అయిన మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట,గుడుంబా, పిడిఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు.

**గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రత ఏర్పాట్లు చేయాలి..**

వచ్చె నెల 7 వ తేదీన ప్రారంభం కానున్న గణేశ్ ఉత్స వాలకు సంబంధించిన వేడుకలను ప్రజలు శాంతి యుతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో, ఎస్.ఐ లు, ఇన్ స్పెక్టర్లు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించా లన్నారు. గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. మండపాల్లో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని మండపం నిర్వహకులు, కమిటీలకు అధికారులు వివరించి చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎస్పీ ఉమ మహేశ్వర రావు, సిఐలు నిరంజన్ రెడ్డి , సురేష్, డిసిఆర్బీ ,సీసీఎస్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్ , లక్ష్మి నారాయణ, ఎస్ఐలు చిరంజీవి, అనిల్, కిరణ్ కుమార్,రాజు, శ్రీకాంత్, శ్వేత,నవీన్, గీత,డిసిఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేరాలను కట్టడి చేయవచ్చని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మెట్ పల్లి పట్టణంలోని దుబ్బవాడలో సోమవారం ఏర్పాటు చేసన కార్యక్రమంలో 40 సీసీ కెమెరాలను స్థానిక ప్రజలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారానే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని,నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పట్టణ, మండల, అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని, దొంగత నాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుం దన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకో వడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుం దన్నారు. మెట్ పల్లిలో ఈ మధ్యకాలంలో రెండు సంవత్స రాల బాలుడు కిడ్నాప్ కేసును సీసీ కెమెరాల ద్వారా గుర్తించి 16 గంటల్లోనే చేదించడం జరిగిందని అన్నారు.సిసి కెమెరాల ద్వారా సేకరించిన సాక్ష్యాల ద్వారా నేరస్థుడు పాల్పడిన నేరాన్ని కోర్టు నిరూపించ వచ్చని అన్నారు. సీసీ కెమెరాలను ప్రధాన రోడ్డు మార్గాల్లో ఎర్పాటు చేయడం ద్వారా జరిగిన రోడ్డు ప్రమాదాలపై తగు సమీక్షా జరిపి రోడ్డు ప్రమాదాల నివాణకు తగిన జాగ్రత్త లో తీసుకోవచ్చు అన్నారు. జిల్లా ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు లో ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.



ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో కృషి చేసిన స్థానిక ప్రజలను అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి ఉమ మహేశ్వర రావు, మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ లు చిరంజీవి ,రాజు తదితరులు పాల్గొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
మంగళవారం 27 ఆగష్టు 2024

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక మహిళ ఆత్మహత్య



అసిఫాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 26 : ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండల కేంద్రంలోని వేకర్ సెక్షన్ కు చెందిన పల్లపు లక్ష్మీ (41) కు నలుగురు పిల్లలు ముగ్గురు కొడుకులు,ఒక కూతురు ఉన్నారు. గతకొంత కాలంగా వీరి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. 2020 సంవత్సరంలో కూతురు పెళ్లికి చేసిన అప్పును ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ ఉండేది. దీంతో ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించి జైనూర్ పోలీసులకు సమాచారం అందించారు.. జైనూర్ ఎస్ఐ సాగర్ సంఘటన స్థలానికి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

## గంజాయి స్మగ్లర్ పై పీడీయాక్ట్



భూపాలపల్లి, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
గంజాయి స్మగ్లర్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేసారు. ఆంధ్రప్రదేశ్ నుండి వరంగల్ మీదుగా మహరాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న భూపాలపల్లి జిల్లా గోరుకొత్తపల్లి ప్రాంతానికి చెందిన గజ్జి సహదేవ్ రాజ్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ పై జారీచేసిన పీడీయాక్ట్ ఉత్తర్వులను శాయం పేట్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ రంజిత్ రావు, దామెర ఎస్ఐ అశోక్ నిందితుడికి పరకాల సబ్ జైల్లో అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ ఉత్తర్వులను అందుకున్న నిందితు డు గత జూన్ నెల 8వ తేదీన మరో ఇద్దరు నిందితులతో కలసి అంధ్రప్రదేశ్ నుండి మహరాష్ట్రకు గంజాయి అక్రమ రవాణాకు చేస్తుండగా టాస్క్ ఫోర్స్ మరియు దామెర పోలీసులు సంయుక్తంగా కలిసి ఈ ముఠాను అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు యాభై లక్షల విలువగల 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు , మూడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకోని జైలుకు తరలించారు.సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో దేశ అభివృద్ధి కీలకమైన యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేందుకుగాను మత్తుపదార్థాల అక్రమరవాణాకు పాల్పడితే సహించేది లేదని అలాగే చట్ట వ్యతిరేక కార్యాల పాలకు పాల్పడితే పీడీ యాక్ట్ క్రింది కేసులు నమోదు చేయబ డుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## మాల పోరాట సమితి జేఏసీ కార్యవర్గం ఏర్పాటు



జగిత్యాల ప్రతినిధి, ( మన వెలుగు ) ఆగస్ట్ 26 :
ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ను వ్యతిరేకిస్తూ జగి త్యాల జిల్లాలోని వివిధ మాల సంఘాలకు చెందిన నాయ కులు ఏకతాటిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని జేఏ సి ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాకు చెందిన గౌరవ అధ్యక్షుడిగా మద్దెల నారాయణ, గౌరవ సలహాదారులుగా కొప్పుల వెంకటరమణ, కంటె అంజయ్య, న్యాయ సలహాదారులు గా నకుమల్ల లక్ష్మి నారాయణ, మీడియా ఇంచార్జి గా నర్ర రాజేందర్, కన్వీనర్లుగా కారంగుల వసంత రావు, చిత్తారి ప్రభాకర్, మ్యాదరి శ్రీహరి, వేల్పుల ప్రవీణ్, ఉరుమట్ల లక్ష్మణ్, రాగుల నర్సింగరావు.కోశాధికారి గా కడమండ కమలాకర్ లను తాత్కాలిక కార్యవర్గంగా ఎన్నుకున్నారు.సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా మాలలకు పిలుపునిచ్చి భారీ బహిరంగ సభ నిర్వహించి ఉత్సాహ వంతులను ఉద్యమాన్ని ముందుకు నడిపే నాయకులను ఎన్నుకొని భవిష్యత్ పోరాట కార్యా చరణను ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల శ్యామ్, కాయితీ శ్రీనివాస్,నాపరి ప్రవీణ్ కుమార్, బొల్లం ప్రభాకర్, నర్ర రాజు, నక్క సురేష్, కాయితీ కిషన్, బోనకంటి రవి తదితరులు పాల్గొన్నారు.


# గ్రామాల్లో ఎన్నికల సందడి



హైదరాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి మొదలైంది.ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల చేయడంతో దసరా నాటికి ఎన్నికలు రావచ్చనే అంచనాలతో ఆశావాహులు సందడి చేస్తున్నారు. బూత్‌ల వారీగా పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇక రిజర్వేషన్ల హడావుడి అయితే కొనసాగుతూనే ఉంది. గత ఎన్నికల్లో అవలంభించిన రిజర్వేషన్లే ఈసారి కూడా అమలు జరుగుతాయని తెలుస్తోంది. బిసి కులగణన చేపట్టిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నా, దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రుల స్థాయిలోనే ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తున్నారు తప్ప స్పష్టత లేదు. ప్రస్తుతం ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు ఎలా ఉండబోతు న్నాయనే దానిపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల సంఘం సెప్టెంబరు 6న గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా జాబితాను జారీ చేయనుంది. దీనిపై 7వ తేదీ నుంచి 13 వరకు డీపీవోలు, ఎంపీడీవోలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. 19వ తేది లోగా అభ్యంతరాలను పరిష్కరించి 21న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. దీంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. ఈ నెల 29న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల జాబితాపై సెప్టెంబరు 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులతో జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వ హించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్‌లను ఏర్పాటు చేయడం, బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 600 మంది ఓటర్లు ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిం చే విధంగా ఎన్నికల సంఘం సిబ్బంది నియామాకాన్ని చేపట్ట నుందని తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు అధికారిక నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత సిబ్బంది నియామకం, బూత్‌ల స్థాయిలో ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది. గత పంచాయతీ ఎన్నికలు 2019లో జరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 12751 గ్రామ పంచాయతీలు ఉండగా 12,732 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫై చేసింది. అలాగే ఈ పంచాయతీల్లో 1,13,354 వార్డులు ఉంటే వాటిలో 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల సంఘం నోటిఫై చేసింది. అప్పట్లో వీటిలో 24 సర్పంచ్ ఎన్నికకు, 492 వార్డు ఎన్నికలకు నామినేషన్లు దాఖలు కాలేదు. కాగా 2134 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. వార్డు సభ్యుల పదవులు 29,985 కూడా ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 10,571 సర్పంచ్ పదవులకు, 82,675 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన 2024లో జరుగబోయే ఎన్నికల్లో ఎన్ని సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఏకగ్రీవం అవుతాయి, ఎన్నికలు జరుగుతాయో చూడాల్సి ఉంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఎవరిని నిలబెట్టాలి, ఎవరిని ఏకగ్రీవం చేయాలనే అంశంపై మంతనాలు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల కారణంగా ఏకగ్రీవం చేసే పంచాయతీలే ఎక్కువ ఉంటాయని భావిస్తున్నారు. కొన్ని చోట్ల పోటీ అనివార్యమైతే ముక్కోణపు పోటీ తప్పదని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే 2018 మే 17 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య 1,37,17,469 ఉండగా, వీటిలో పురుష ఓటర్లు 68,50,309 ఉండగా, మహిళా ఓటర్ల సంఖ్య 68,66,300 మంది, ఇతరులు 860 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో 96,029 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యతో పాటు పోలింగ్ స్టేషన్లు కూడా గణనీయంగా పెరుగుయని భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న తుది ఓటర్ల జాబితా ప్రకటించడంతో ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు పడుతుంది.

# సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 12 ఫిర్యాదులు స్వీకరణ- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



రాజన్న సిరిసిల్ల, ( మన వెలుగు ) ఆగస్టు 26 :
ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 12 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యల ను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూతగా దాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధన లకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యేలా ఎప్పటిక ప్పుడు సమీక్షించు కుంటూ ప్రజలకు మరింత సమర్థవం తంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలం భిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యల ను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

# ఈవీఎంలు ఇక్కడ.. తాళాలు ఎక్కడ?

- **విజయనగరం జిల్లా నెల్లిమర్ల గోదాం వద్ద తనిఖీల్లో హైడ్రామా**
- **ఈవీఎంల ట్రంక్‌బాక్స్ తాళం కోసం గంటల తరబడి నిరీక్షణ**
- **బృందంతో కలసి గోదాం వద్ద కలెక్టర్ పడిగాపులు**
- **ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటి గంటకు మాక్ పోలింగ్.. అర్ధరాత్రి దాకా కొనసాగిన ప్రక్రియ**
- **బ్యాటరీ చార్జింగ్ స్టేటస్‌పై అనుమానాలను నివృత్తి చేయకుండా కొత్త బ్యాటరీ వినియోగం**
- **పార్టీల గుర్తులు కాకుండా ఇష్టానుసారంగా గుర్తుల లోడింగ్**
- **నేడు కూడా కొనసాగనున్న ప్రక్రియ**

విజయనగరం: ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా సందేహాలు వెల్లువెత్తుతుండగా వాటిని నివృత్తి చేసి పారదర్శకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల యంత్రాంగం మరిన్ని అనుమానాలకు తావిచ్చేలా వ్యవహరిస్తోంది. తాజాగా విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని ఈవీఎంల గోదాం వద్ద జరిగిన హైడ్రామానే దీనికి నిదర్శనం. ఈవీఎంలు భద్రపరిచిన గది తాళాన్ని తెరిచిన అధికారులు.. ఈవీఎంలున్న ట్రంక్ పెట్టె తాళం చెవి మాత్రం దొరకలేదని తాపీగా చెప్పడంతో దాదాపు రెండు మూడు గంటల పాటు గందరగోళం నెలకొంది. అన్నిచోట్లా గాలించి ఎట్టకేలకు తాళం చెవి తెచ్చేవరకు ఈవీఎంల గోదాం వద్ద కలెక్టర్ తన బృందంతో కలసి పడిగాపులు కాయక తప్పలేదు.

సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల బ్యాటరీ స్టేటస్, ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు - వీవీ ప్యాట్లలో ఓట్ల స్లిప్పులను లెక్కించి సరిపోల్చాలని కోరుతూ విజయనగరం లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే. గజపతినగరం నియోజకవర్గంలో మే 13వ తేదీన దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ పోలింగ్ జరిగిందని, దాదాపు 81.06 శాతం ఓటింగ్ నమోదైందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఈవీఎంలకు, వీవీ ప్యాట్లకు బ్యాటరీ కనీసం 50 శాతమైనా వినియోగమై ఉంటుందన్నారు. అయితే దాదాపు 21 రోజుల తర్వాత జూన్ 4వ తేదీన కౌంటింగ్ కోసం వాటిని తెరిచినప్పుడు బ్యాటరీ స్టేటస్ (పవర్) 99 శాతం చూపించడం తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అందువల్ల గజపతినగరం అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలం పెదకాద పోలింగ్ స్టేషన్ నంబరు 20లో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల బ్యాటరీ స్టేటస్ 99 శాతం ఎందుకు ఉందో వెరిఫికేషన్ చేయాలని కోరారు.

**తలుపులు తెరిచారు.. తాళం చెవి మరిచారు**

పోలింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను, వీవీ ప్లాట్లను నెల్లిమర్లలోని గోదాంలో భద్రపరిచారు. నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టరు ప్రతి నెలా వాటిని కచ్చితంగా తనిఖీ చేయాలి. బొత్స అప్పల నర్సయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు సోమవారం వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని రెండు రోజుల క్రితమే అధికారులకు తెలుసు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల కల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు ఎన్నికల కమిషన్ నియమించిన బెల్ ఇంజనీర్ల బృందం గోదాం వద్దకు చేరుకుంది.అయితే ఈవీఎంలు భద్రపరిచిన గది తాళాన్ని తెరిచిన అధికారులు ఈవీఎంలున్న ట్రంక్ పెట్టె తాళం చెవి మాత్రం మరచిపోయినట్లు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. వాస్తవానికి ఆ తాళాలు కలెక్టరేట్‌లోని ఎన్నికల సెల్ వద్ద ఉండాలి. అయితే మధ్యాహ్నం కావస్తున్నా తాళం చెవి రాకపోవడంతో పగలగొట్టేందుకు అధికారులు సిద్ధం కాగా ఫిర్యాదుదారుల తరపున హాజరైన బెల్లాన వంశీ అభ్యంతరం చెప్పారు.